# రూమ్ నెం 117

తాళ్లూరు నాగేశ్వరరావు



"అబ్బా! తొమ్మిదిన్నరైందే! బస్సులుకూడా వుండవు. ఆటోవేసుకువెళ్ళాలి. ఇక వస్తానే సత్యా!" అంటూ చివుక్కున లేచింది వేదవతి సోఫాలోంచి. టీపాయ్‌మీ దున్న హ్యాండ్‌బ్యాగ్‌ను అందుకుంటూ.

"ఎంతదూరం వెళ్ళావ్!...ఇక్కడే ఫోం చేయకూడదూ! బోయ్‌చేతతెప్పిస్తాను." అంది సత్యవతి గదిలో బెడ్ పక్కనే అమర్చిన డెక లామ్ బోర్డుమీద స్విచ్‌లలో 'గంట' బొమ్మ వేసివున్న స్విచ్‌ను నొక్కబోతూ.

"మైగాడ్! నేను హోటల్లో ఫోంచేశానని తెలిస్తే మా అత్తగారు వీధిగుమ్మంముందేనిల బెట్టి, నిలువునా దుమ్ముదులిపివేయదూ! ఎందుకొచ్చిందిగానీ! నువ్వు ఫోంచేయ్. రేపు మా ఇంటికి భోజనానికి రమ్మంటే, తెల్లవారాక వెళ్ళిపోతున్నావ్? ఇదేం బావుండలేదు. సత్యా?...రాకరాక హైద్రబాద్ వచ్చావు–ఆ సైన్సు టీచర్సు కాన్ఫరెన్సు పుణ్యమాఅంటూ రెండ్రోజులన్నా వుండకపోతివి. సిటీ అయినా సొంతం చూడలేదు. ఇక్కడ చెట్టంత స్నేహితురాల్ని వుండగా, ఒక్కదానివీ ఇంతపెద్ద పోష్ హోటల్లో దిగావు. ఎంత ధైర్యమే నీకు?"

"అదికాదు వేదా! ఒక్కరోజు భాగ్యానికి నిన్ను ఇబ్బంది పెట్టడం దేనికిలేఅనిఇక్కడ దిగాను. నాకు హైద్రాబాద్‌కొత్త. ఉదయం సూపర్‌డిలక్స్ బస్సుదిగి, మంచి హోటల్‌కు తీసుకెళ్ళమని ఆటో వాడితో చెప్పాను. ఇక్కడకు తీసుకొచ్చాడు. సింగిల్‌రూమ్ ఇరవై రూపాయలైనా సౌకర్యంగానే ఉంది."

"సౌకర్యాలకేమొచ్చెగాని సత్యా! జాగ్రత్త ఒక్కత్తవే! పైపెచ్చు ముప్పైరెండేళ్ళబ్రహ్మచారిణివి. అందమైన ఆడదానివి. అభమూ శుభమూ ఎరుగనిదానివి. పెద్దపెద్ద పట్టణాల్లో పెద్దపెద్ద హోటళ్ళల్లో ఏవేవో మోసాలూ, ఘోరాలూ జరుగుతుంటాయంటారు. తలుపులు గట్టిగా వేసుకో! అన్నిరూములూ ఒకేరకంగా వుంటాయి కాబట్టి, ఏ అర్థరాత్రో ఏ ఆకతాయో వచ్చి తలుపులు తట్టవచ్చు. వచ్చినా తీయకు. తీసివా ఏ తాగుబోతో తూలుతూ లోపలకొస్తాడు. ఆ పైన గొంతుచించుకున్నా వాడుగోలచేయక పోడు" అంది వేదవతి వ్యంగ్యాత్మకమైన హెచ్చరికతో.

"ఏమిటే? మరీ పసిపిల్లకు చెప్పినట్టుచెబుతున్నావ్? నీకంటే రెండు డిగ్రీలు ఎక్కువ చదువుకున్న దానిని. పదేళ్ళనుంచీ లెక్చరర్ ఉద్యోగం చేస్తున్న దానిని."

"కావచ్చు. డిగ్నిటీ పోయిన తర్వాతడిగ్రీలేం చేస్తాయి? ఉద్యోగాలేంచేస్తాయి? ఆడదాని బ్రతుకు అరిటాకు లాంటిదిగదా! అందులో బ్రహ్మచారిణి బ్రతుకు సంగతి వేరేచెప్పక్కర్లేదు. భద్రంగా కాపాడుకున్నంత వరకే గాజు పాత్ర గట్టిగా వుంటుంది. చేయిజారితే, చిన్న చిన్న ముక్కలవుతుంది."

"ఈ నీతులన్నీ నూరిపోయకే? నొసటి వ్రాతలు ఎలావుంటే అలానే జరుగుతాయి. నా జాగ్రత్తలో నేనుంటాన్లే. నువ్వేమీ గాబరా పడకు. నువ్వు అనుకున్నంత అమాయకురాల్ని కాదు నేను.

"దెన్. ఓ.కె. వెళ్ళొస్తానే సత్యా!" అంటూ బయల్దేరింది వేదవతి. స్నేహితురాల్ని బయటి దాకాసాగనంపుదామని గదివెలుపలికివచ్చింది సత్యవతి తలుపులు వేసి. ఎర్రసంజెరంగు కార్పెట్‌తో కారిడర్ అంతా కప్పబడివుంది. అదిమూడో ఫ్లోర్. కారిడార్ చివర బాల్కనీ వద్ద ఓ సవయర్ యూనిఫారమ్ దుస్తుల్లో నిలబడి రోడ్డుమీదకి సర్దాగా చూస్తున్నాడు. ఇంకా ఆ కారిడార్‌లో ఎవ్వరూ లేరు. మత్తు మందు పుచ్చుకొన్నట్టు మగతగా వెలుగుతూన్న నారింజ రంగు దీపాలు తప్ప.

లిఫ్ట్ దగ్గర స్నేహితురాండ్రిద్దరూ 'గుడ్ నైట్' చెప్పుకున్నారు. ఆప్యాయతల్ని వొలకబోస్తూ. వేదవతి అటు లిఫ్ట్‌లో కిందికి దిగింది. సత్యవతి ఇటు తన గదికి బయలుదేరింది.

సత్యవతి తెనాల్లో బోటనీ లెక్చరర్‌గా పని చేస్తూన్నది. ఇంకా అవివాహిత. ముప్పైరెండేళ్ళ వయస్సు వచ్చినా ఆమె ఇంకా పెళ్ళి చేసుకోలేదంటే అందుకు ప్రదానకారణం జీవితాంతమూ బ్రహ్మచారిగానే వుండిపోదామని ఆమె పన్నెండేళ్ళక్రితం తీవ్రంగా నిర్ణయం తీసుకోవడమే. ఆ నిర్ణయానికి దారితీసిన పరిస్థితులను గురించి పరిసరాల్లో, ఫ్రెండ్స్ సర్కిల్లో, బంధుసమూహంలో ఎన్నెన్నో పుకార్లు ప్రచారంలో ఉన్నమాట వాస్తవమేగానీ, ఆమె ఎవ్వరితోనూ 'ఫలానా కారణం వల్ల ఈ జన్మకు పెళ్ళి మానేస్తున్నాను' అని కచ్చితంగా గీతగీసి చెప్పడం జరగలేదు. యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివేరోజుల్లో ఒక డాక్టర్ని ఆమె గాఢాతిగాఢంగా ప్రేమించిందనీ; ఆ ప్రేమ ఫలించలేదనీ, ఆ డాక్టరు లక్షరూపాయల కట్నాన్ని వెండిపళ్ళెంలో పుచ్చుకుని, నులి పురుగులాంటి పెళ్ళాన్ని వెంటేసుకొని అమెరికా వెళ్ళిపోయాడనీ. ఆ నిష్ఫలప్రేమతో, పురుషజాతిమీద పెంచుకొన్న ద్వేషంతో, ఈ జన్మకు పెళ్ళి చేసుకోను అని దారుణంగా ప్రతిజ్ఞ చేసిందనీ కొందరు అనుకోవడం కద్దు. మరి కొందరు చెప్పుకొనేదేమిటంటే- కానీ కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవడం ఆమె ఆదర్శమనీ, ఆ ఆదర్శం ఇంతకాలంగా ఆచరణ సాధ్యం కాలేదనీ, అందుచేతనే గెలవేయని అరటి చెట్టులా వుండిపోయిందనీ, మరి నాలుగేళ్ళుపోతే స్త్రీత్వమే క్షీణించిపోయి పెళ్ళి అవసరమే వుండదనీ. ఈ రకంగా ఆమె అవివాహాన్ని గురించి ఎన్నోకధలూ, కల్పనలూ గాలిలో గడుసుదెయ్యాల్లా వున్నప్పటికీ, ఆమె ఎప్పుడూ బెదరలేదు. చెదరలేదు. తాను పెళ్ళి చేసుకోకుండా వుండటానికి గల కారణాన్ని ఎవ్వరితోనూ సూచాయగానైనా చెప్పలేదు. చివరకు తల్లిదండ్రులక్కూడా సంజాయిషీ ఇవ్వలేదు.

అయితే సత్యవతి ప్రాతివత్యాన్ని గురించి దుష్ప్రచారాలు ఉన్నదాఖలా ఎక్కడా లేదు. ఆమె ఫలానా పురుషుడికేసి ఆశగా చూసిందనిగానీ, ఫలానావాడితో వలపు వెన్నెల్ని చిందిస్తూ చిరునవ్వును చిలకరించిందనిగానీ, ఫలానా మగవాడితో పది నిముషాలపాటు ప్రేమగా మాట్లాడిందనిగానీ ఎవ్వరూ ప్రత్యక్షంగా వీక్షించి పబ్లిసిటీ ఇవ్వలేదు. పైపెచ్చు ఆమె ప్రేమను పొందటానికి. ఆమెను పరిణయమాడటానికి అనేక దశలలో అనేక మంది తీవ్రాతి తీవ్రంగా ప్రయత్నాలు చేసి, నిరాశా నిస్పృహలతో తోకముడుచుకోవడం కూడా జరిగింది.

సత్యవతి అపురూప సౌందర్యవతి కాకపోయినా, ఆమె అంద చందాలకు యాభై శాతానికి మించి మార్కులు వస్తాయి-ఆమెను ఆరాధించే వాళ్ళ దృష్టిలో. కొంచెంగా కోల మొహం. పాలకొల్లు బత్తాయివంటి రంగు, కనుముక్కుతీరు చక్కగా ఉంటుంది.వొంకుల జుత్తు, ఏ సవరంతో పని లేకుండానే జఘనాలను తాకే జడ, గుండ్రటిమెడ.వాలుభుజాలు, మగవాడి చూపుల్ని ఇట్టేఆకర్షించే వక్షోజాలు సగటు స్త్రీ కంటె రెండంగుళాల పొడుపెత్తు, ఆ ఎత్తుకు సరిపడా లావు, రోల్డుగోల్డ్ ఫ్రేం కళ్ళజోడు ఆమె మొహానికి ఠీవి ఇచ్చినా, చదువుకొనేటప్పుడు మాత్రమే కళ్ళజోడు పెట్టుకుంటుంది. అమె ఎప్పుడూ నైలెక్స్, మొదలైన ఫారిన్ చీరలె సాదావీ,ఎంబ్రాయిడరీ చేసినవీ ధరిస్తూ ఉంటుంది. నగలపై మోజు లేదుగానీ, చేతులకు రెండు ఎనామిల్ బంగారు గాజులూ, మెడలో శ్రీవెంకటేశ్వరస్వామివారి చిత్రపటం ఉన్న లాకెట్‌గల ఒంటిపేట గొలుసూ వేసుకొంటూ ఉంటుంది.

కారిడార్‌లో కార్పెట్‌పై నిశ్శబ్దంగా నడుస్తూ, మనస్సులో ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ, మొహంపై పటిన చిరు చెమటను చేతి రుమాలుతో అద్దుకొంటూ - ఏదో ఆలోచిస్తూ, ఓరగా వేసివున్న రూమ్ స్ప్రింగ్ డోర్‌ను తెరుచుకొని లోపలకు వెళ్ళింది సత్యవతి. గదిలోకి వెళ్ళగానే ఆమెకు వెంటనే బాత్‌రూమ్‌లోకి పోవాలని పించింది, పరధ్యానంగానే బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. రెండు నిముషాల తర్వాత బయిటికి రావటానికి బాత్‌రూమ్ తలుపు మెల్లగా తెరిచింది.

ఎదురుగా కనబడిన దృశ్యానికి ఆమె గుండెలో భయం 'గుప్' మన్నది. ఓ మధ్య వయస్కుడు సోఫాలో కూర్చుని సిగరెట్టు వెలిగించు కుంటున్నాడు. నల్లగా, తుమ్మమొద్దులా వున్నాడు. అమావాస్య చీకటిలాంటి ఆ శరీరంపై తెల్లటి మబ్బువంటి బనియన్ ఎరుపూ, నలుపూ రంగుల పూల లుంగీ ధరించాడు. నుదురును కప్పివేసే జులపాల జుత్తుతో చెవులకు రెండు సెంటిమీటర్లు కిందికి దిగిన పట్టీలతో, మెడతో ఏకమైన గడ్డంతో - భీకరంగా ఉన్నాడు.కుడికంటి కింద చెక్కిలిపైన గుర్రపుసాడా వంటి గండు వుంది—మనిషిలోని క్రౌర్యాన్ని కొట్టవచ్చినట్టు ప్రకటిస్తో, ఎడంచేతి మోచేతిపైన రాగి కడియం వేసి వుంది.

అతన్ని చూడగానే సత్యవతికి గుండె గొంతులోకి వొచ్చినంత పనైంది, కొన్ని క్షణాలపాటు ఏ ఆలోచనా పోలేదు. కెవ్వున కేకవేయబోయింది; కాని గొంతు అనుమతివ్వలేదు. బాత్‌రూమ్ తలుపు దగ్గరకు వేసింది. బోల్టువేసే ధైర్యం లేకపోయింది. ఆ చప్పుడుకు అతను బాత్‌రూమ్‌లోకి వస్తే!

ఎవరతను? ఇంత రాత్రివేళ తన గదిలోకి ఎందుకొచ్చాడు? పైగా గది తలుపులు బోల్టు కూడా వేసినట్టున్నాడు? ఎంత సాహసం? ఏ దురుద్దేశంతో, ఏ దారుణాన్ని తలపెట్టి ఇంత ధైర్యం చేశాడో! ... అనుకొన్న కొద్దీ సత్యవతిలో గాబరా విపరీతమైంది. మెల్లగా తలుపు తెరిచి చూసింది.

...రూమంతా చిందర వందరగా ఉంది. ఉలెన్ ప్యాంటు ఓ చోటా, టెర్లిన్ షర్టు మరో చోటా, మఫ్లర్ ఇంకోచోటా ఉన్నాయి. బెడ్‌షీట్ నలిగి వుంది. రూమంతా యాష్‌ట్రే లాగా సిగరెట్టు నుసితో, ముక్కలతో నిండి వుంది.

'మైగాడ్! ఇది నా రూమ్‌కాదు' అనుకుంది సత్యవతి. అలా అనుకోవడంతో ఆమె శరీరంలోని నరాలన్నీ బిగుసుకు పోయినాయ్. కొన్ని నిముషాల వరకూ స్పృహలేకపోయింది.

అతను ఏం చేస్తున్నాడోనని మెల్లగా తలుపు తెరిచి చూసింది. టీపాయ్‌మీద గ్లాసు పెట్టి, అందులో రెండున్నర అంగుళాలమేరకు విస్కీ పోశాడు. ఆ విస్కీలో ఓ అంగుళంన్నర మేరకు నీళ్ళు కలిపాడు. ఆ గ్లాసుఎత్తి దించకుండా గటగటా తాగాడు. సిగరెట్టు వెలిగించాడు. పక్కన పొట్లాంలో వున్న మిరపకాయ బజీలను కసకస నమిలాడు. మళ్ళీ గ్లాసులో విస్కీ, ఆ విస్కీలో కొద్దిగా నీళ్ళు; ఆ గ్లాసుఎత్తి తాగాడు. ఆ విధంగా సీసాను ఖాళీ చేశాడు పదిహేను నిముషాల్లో.

'ముళ్ళమీద నిలబడినట్లుంది సత్యవతికి ఆ బాత్‌రూమ్‌లో. ఏ క్షణంలోనైనా అతను బాత్‌రూమ్‌లోకి రావచ్చు, అప్పుడు తనని చూస్తాడు. చూసి ... వూరుకుంటాడా? బాగా విస్కీ మత్తులో వున్నాడు. తాగిన వాడికి తన వళ్ళు తెలీకపోవటమే కాకుండా, ఎదుటివాళ్ళ విషయంకూడా తెలీదు. తనని అమాంతంగా కౌగిలించుకొని, బెడ్‌మీదకు లాక్కెళితే!... అమ్మ బాబోయ్!...తనేం చేయగలదు? ఎంత చదువుకున్నా, ఏం ఉద్యోగం చేస్తున్నా— మగవాడి ముందు ఆడది ఆడదే! అందులో బలిష్టంగా ఉన్నాడు; పెద్ద రౌడీలా వున్నాడు; భయంకరంగా వున్నాడు. ఈ ప్రమాదమేదో జరక్కముందే తను అతనికెదురుగానే బయిటకెళితే! ... చూస్తూ, చూస్తూ పులినోట్లో తల దూర్చడమా? బిగ్గరగా కేకలువేస్తే...! చుట్టు

పక్కల గదుల్లోంచి — అందరూ పరుగెత్తుకొస్తారు — ఆ ఆర్తనాదానికి? అది పెద్ద దృశ్యానికి కారణ భూతమవుతుంది. అంత రాత్రప్పుడు పరాయి మగవాడి గదిలో ఎందుకున్నావని నలుగురూ తననే ప్రశ్నిస్తారు. అనుమానిస్తారు. తనే విధంగా సంజాయిషీ చెప్పుకోగలదు? తనపరువుప్రతిష్ఠల్ని తనేమంటలో కల్పుకున్నట్లవుతుంది! అది మంచి పద్ధతి కాదు...

అయితే తనేం చేయాలి? కర్తవ్యమేమిటి? ఈ ప్రమాదంనుంచి గౌరవంగా, సురక్షితంగా బయట పడడమెట్లా? ఈ అపాయంలో ఉపాయమేది? ... సత్యవతి ఆలోచిస్తునే అలాగేబాత్‌రూమ్‌లో నిలబడివుంది నిశ్శబ్దంగా. మధ్య మధ్యలో మెడలో లాకెట్‌తో అమర్చబడివున్న శ్రీ వెంకటేశ్వరస్వామివారి బొమ్మను చూస్తూ, "ఈ గండంనుంచి ఏ అపకీర్తి లేకుండా రక్షించుస్వామీ!" అంటూ మనస్సులో ప్రార్థనలు చేయసాగింది.

రాత్రి పదిన్నరైంది.

లోపలా, బయటా ఏ చప్పుడూలేదు. ఎక్కడో దూరంనుంచి 'నడిరేయి...' పాట సన్నగా వినిపిస్తోంది.

బాత్‌రూమ్ తలుపు తెరిచి మెల్లగా చూసింది సత్యవతి. అతను లైట్ ఆర్పేసి, బెడ్‌మీద చాప్పకట్టలా పడుకున్నాడు. బెడ్ లైట్ కాంతి మటుకు నీలంగా గదంతా పర్చుకుంది. 'అమ్మయ్య!' అనుకుంది సత్యవతి నిట్టూర్పు విడుస్తూ సహం గండంగడిచినట్టుగా నరాలన్నీ రిలీఫ్‌ను పొందాయి.

అరగంట గడిచింది...

నిశ్శబ్దంగా బాత్‌రూమ్ తలుపు తెరిచింది సత్యవతి. అతను ఈ పాటికి గాఢంగా నిద్రపోయే వుంటాడు. అయితే అతని గురకగానీ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగానీ ఏమీ వినరావడం లేదు. కుతికెమీద తాగాడు కాబట్టి, ఆరెండూ బయటికొచ్చే అవకాశం లేకుండా గాఢ నిద్రపోతున్నాడేమో!

నీలిరంగు బెడ్‌లైట్ కాంతిలో అతను స్పష్టంగా కనబడుతున్నాడు. భుజాలవరకు బ్లాంకెట్ కప్పుకున్నాడు. సత్యవతి బాత్‌రూమ్‌లోంచి బయటికొచ్చింది పిల్లిలా అడుగులో అడుగువేసుకుంటూ. అతని బెడ్ దగ్గర నిలబడింది. అతని మొహంలోకి పరిశీలనగా చూసింది. ఆమెకు హఠాత్తుగా అనుమానమేసింది— అతనసలు బ్రతికి వున్నట్లేనా? అని అనుమానం రాగానే ఆమెలో కొత్తభయం రెక్కలు విప్పుకొంది. అతనుచనిపోయివుంటే

# జైల్లో చంద్రిక

కాలం మారింది కథ మారింది
కలంలో సిరా మారింది
గొంతు ఎండింది కొమ్మ ఎండింది
గుడిసెలో ఒక కడుపు మండింది
పొగరెక్కిన ఫాక్టరీ త్రేన్చింది
సగం సగం జీతాలు వాన్చింది
నిక్కి ఎగురుతూంది నిలువునా జెండా
నక్కి నక్కి చూస్తున్నాడు నల్లవిఫణి గూండా.
ఇదిగో పులి ఇదిగో పులి అదేతోక.
ఈ మాట నమ్మవచ్చు అనుమానం లేక
ముఖం చూసినప్పుడే యిది నిజంగా ఆవు
నఖాలు చూస్తే దెబ్బవేస్తే చచ్చిన చావు
చీకట్లు క్రమ్మాయి చిక్కులూ క్రమ్మాయి.
అకాశ మధ్యాన రెండు మబ్బులు కుమ్మాయి
వెన్నెల వస్తుందా వెలుగులు తెస్తుందా?
ఉన్న చెరసాల కిటికీ లోంచి ఊరడిస్తుందా?

—ఆరుద్ర

ఏ గుండెజబ్బుతోనో, లేదా ఆత్మహత్య చేసుకొనివుంటే- పొరబాటుగా గదిలోకి వచ్చినందుకు. ఆ నేరం తన మీద పడదుగదా ! ఛీ! ఛీ! ఎంతపని చేసింది తను? స్వయంకృతాపరాధం?

ధైర్యంగా అతన్ని తట్టింది సత్యవతి. ఏ కదలికా లేదు. అసలు గుండె ఆడుతున్నట్లే లేదు. చచ్చాడు అతను. సందేహంలేదు ఇంకా తను ఆ గదిలో వుండడం మంచిది కాదు. ఏ కారణం వల్ల చచ్చాడో ! ఎట్లా చచ్చినా, ఆ శవం గదిలో, అతనితో ఏ సంబంధములేని తను ఉండడం ఎవరైనాచూస్తే తనకే ప్రమాదం ! సాక్ష్యాలూ, కోర్టులూ, శిక్షలూ– ఎందుకొచ్చిన ఇబ్బంది! ఫలానా వ్యక్తి బెడ్‌రూమ్‌లో ఫలానా ఆడదివుంది' అన్నప్రచారమైతే ఇంకా తనబ్రతుక్కు విలువ ఏముంటుంది! తాను నైతిక పతనం చెందినట్టు లోకం ముద్ర వేయదూ ! ఆ అపఖ్యాతివచ్చిందంటే తనుమాత్రం బ్రతికి ఏంప్రయోజనం?

వెంటనే సత్యవతి గుండెలో చిక్కని భయం పేరుకోగా తడబడే అడుగులతోతలుపు బోల్టుతీసి. రూమ్‌నెం 117 నుంచి తన రూమ్ అయిన నెం 118 లోకి వెళ్ళింది. వెంటనేబెడ్ మీదపడుకొని గండం గడిచిన రిలీఫ్‌తో గుండెమీద అరిచేయి పెట్టుకొంది. 'తను ఇవాళ లేచిన వేళ ఎంతోమంచిది. లేకుంటే ఎంత ఘోరమైన ప్రమాదంలో ఇరుక్కునేది?' అనుకుంది సత్యవతి. అంతలోనే ఆమెకు జ్ఞాపకం వచ్చింది. బాత్‌రూమ్‌లో చేతిరుమాలు వొదిలివేసినట్టు. దిగున లేచింది సత్యవతి. ఆ చేతిరుమాలు అక్కడేవుంటే ఆ గదిలో తాను ఉన్నట్టు ప్రత్యక్షసాక్ష్యంగా పరిణమిస్తుంది. అందువల్ల లేనిపోని గొడవలు బయల్దేరవచ్చు మళ్ళీ సత్యవతి మెల్లగాలేచి రూమ్‌నెం 117 లోకి వెళ్ళి, బాత్‌రూమ్‌లో పడివున్న చేతిరుమాలును తీసుకొచ్చింది. అదృష్టవశాత్తు కారిడార్‌లో ఎవ్వరూలేరు. అతను ఆరూమ్‌లో కట్టెలా అలానే పడివున్నాడు.

సత్యవతి ఏవేవో ఆలోచించుకొంటూ ఏ తెల్లవారఝామునకో నిద్రపోయింది– కలత మనస్సుతో.

ఆమె నిద్రలేచేసరికి ఏడున్నరైంది. పక్కగదిలో మనుషుల అలికిడీ. మాటలూ అస్పష్టంగా వినబడుతున్నాయి. రాత్రి దుర్ఘటన తాలూకు భయం ఆమెలో ఇంకా పచ్చిపచ్చిగానే వుంది.

బెల్ కొట్టగానే బాయ్ వచ్చాడు.

"ఏంకావాలండీ ! కాఫీ, టిఫిన్"

"కాఫీ తెచ్చిపెట్టు"

"అల్లాగేనండీ !"

"ఏమిటోయ్! పక్కగదిలో ఎవరోచాలమంది వచ్చినట్టున్నారు." అంది సత్యవతి కుతూహలంగా,

"మీకు తెలియదా అండీ !"

"ఏం జరిగిందేమిటి ?"

"పక్కగదిలో ఆయన రాత్రి గుండెజబ్బు వొచ్చిహఠాత్తుగా పోయాడటండీ ! పోలీసులూ డాక్టరూ వచ్చారు."

"ఎవరాయన ?"

"నెంబర్‌వన్ హంతకుటడండీ !"

"హంతకుడా ?"

## దొంగసొమ్ము

మేస్టారు చురుకైన కుర్రాణ్ని ఓ ప్రశ్న వేశారు.

"ఒరే రాంబాబు! దొంగసొమ్ము కాలవపాలు" అనే సామెతకి ఒక ఉదాహరణ చెప్పరా ?

"మొన్న రమేష్ దగ్గర కొట్టేసిన పెన్నుని మా తమ్ముడు కాలవలో పారేశాడండి." వాడి జవాబుకి క్లాసంతా ఘొల్లుమంది.

—'మహేష్'

"అవునటండీ ! స్త్రీ హంతకుడటండీ ! ఈ మధ్య ఈ సిటీలోనే ముగ్గురమ్మాయిల్ని చెరచి ఆనేరం బయటికి పొక్కకుండా వుండటానికి వాళ్ళను హత్యచేశాడట ! ... ఒకామెను ముక్కలు ముక్కలుగా నరికి, పెట్టెలోపెట్టి హుసేన్ సాగర్‌లో పడవేయించాడట, మరో యువతిని గొంతుపిసికి చింతలబస్తీలో ఓపాడుబడ్డ బావిలోకి తోసివేశాడట. ఇంకో స్త్రీని..."

సత్యవతి భయకంపితురాలై ఆమాటలువిన లేనట్టు రెండుచెవుల్నీ రెండుచేతులతో మూసుకుంది గట్టిగా.

"మీరా హంతకుడి పక్క రూములోనే వున్నారు ఒంటరిగా. అదృష్టవంతులు. వాడి కన్ను మీ మీదపడలేదు..." అంటూ బాయ్ వెళ్ళాడు.

భయోత్పాదంతో సత్యవతి వొళ్ళు గజగజలాడింది.

M/s. శ్రీ దుర్గా ఏజన్సీస్

హోల్ సేల్: బ్యాటరీలు, షోప్స్, ఫ్యాన్సీసామానులు

పాత కాలేజీ రోడ్డు,

గుడివాడ.